ప్రజాశక్తి
గురువారం 13 మార్చి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి -వలేటివారిపాలెం :మండలంలోని అయ్యవారిపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ -4 లోని ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఉన్న ఇటుక బట్టీలను తక్షణమే తొలగించాలని సూచించారు. లేదంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవు తున్నాయని పత్రికలలో వరుస కథనాలు రావడంతో సబ్ కలెక్టర్ ఎట్టకేలకు స్పందించారు. క్షేత్రస్థాయిలో ఉంటూ స్థానిక పరిస్థితులను విఆర్ఒలు, సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాల న్నారు. ఆమె వెంట తహశీల్దారు షేక్ అబ్దుల్ హమీద్, వీఆర్వో నారాయణ, సర్వేయర్ సింగయ్య ఉన్నారు.

నిఘా..నింగిలో కాదు..నేలపై చేయాలి..!

రాష్ట్ర ప్రభుత్వం మద్యం మరింత సరసంగా, సకాలంలో, అంజేస్తుండడం, రాజకీయ నేతల పలుకుబడితో మద్యం బాబులు, ఆకతాయిలు, రౌడీలు చెలరేగిపోతున్నారు. శివారు ప్రాంతాల్లో మరింత రెచ్చిపోతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో దౌర్జన్యాలకు దిగుతున్నారు.. ఎవరిపైనా ఫిర్యాదు చేస్తే మళ్లీ దాడులు చేస్తారనే భయంతో జనం రౌడీమూకల ఆగడాలు సహిస్తున్నారు. రాజకీయ నేతలకు జనం కోసం, ఓట్ల కోసం ఇలాంటి వ్యక్తులను దగ్గరకు తీస్తుండడంతో ఇటీవల కాలంలో మరింత విచ్చలవిడిగా మారుతున్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి వ్యక్తులను ప్రోత్సహించిన రాజకీయ నేతలు, ఇప్పుడు దానిని కొనసాగిస్తున్నారు. ఎస్‌పి కృష్ణకాంత్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. సిసి కెమెరా నిఘా పెట్టారు. కొంత మేర ప్రయోజనం కలుగుతున్నా, నగర శివారు ప్రాంతాలు, నగరంలోని పలు ప్రాంతాల్లో దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. పోలీసులు తమదైన శైలిలో చర్యలు తీసుకోకపోవడంతో పెద్దగా మార్పు కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి...

-పెట్రేగిపోతోన్న మద్యం బాబులు
-నగరం, శివారు ప్రాంతాల్లో హల్‌చల్
-రాజకీయ నేతల చెంత ఆకతాయిలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వ కాలంలో గంజాయి, మద్యం, ఆకతాయిలు, రౌడీలు, బ్లేడ్ బ్యాచ్‌లు రాజకీయ నేతల చెంత చేరారు. ఒకప్పుడు భయం భయంగా బతికే వారంతా స్థానికంగా రాజకీయ నేతలకు శిష్యులుగా మారిపోయారు. వైసిపి, టిడిపి నేతలు వీరిని ప్రోత్సహించారు. మీటింగ్‌లకు జనం తీసుకురావడం, ఓట్లు కోసం వీరిని వెంట తిప్పుకున్నారు. ఇప్పుడు వారే ఒక్కో ప్రాంతంలో బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా మారిపోయారు. ఒక వేళ పోలీసులు ఎవరినైనా స్టేషన్‌కు తీసుకొస్తే రాజకీయ నేతలు మా వాడేనంటూ చెప్పడంతో ఈ బ్యాచ్ మరింత రెచ్చిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇలాంటి బ్యాచ్‌లు కనిపించకుండా పోతాయని అందరూ భావించారు. ఇప్పుడు అదే కొనసాగుతోంది. నెల్లూరు నగరంలోని కనకమహల్ సెంటర్, విజయమహల్ గేటు, మూడు హాళ్ల సెంటర్, మాగుంట లేవుట్, పొదలకూరు రోడ్డు, మైపాడు గేట్, స్టోన్‌హౌస్‌పేట కేంద్రాలు వీరికి అడ్డాలుగా మారిపోయాయని తెలుస్తోంది. రాత్రి సమయాల్లో దౌర్జన్యాలకు దిగడం, బెదిరించడం, దొంగతనాలు ఇలా అనేక అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ప్రధానంగా నగరంలోని టీ షాపులు, హబ్‌లు వీరికి కేంద్రాలుగా మారిపోయాయి. ఇటీవల కాలంలో వరుసగా మద్యం మత్తులో హత్యలు జరిగాయి. ప్రధానంగా నగర శివారు ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల నుంచి గంజాయి, మద్యం, రౌడీ మూకలు చెలరేగిపోతున్నాయి. పొదలకూరు రోడ్డు, కొత్తూరు, సుందరయ్య కాలనీ, విపిఆర్, ఇందిరమ్మ కాలనీ, ఎన్‌టిఆర్ నగర్, జొన్నవాడ రోడ్డు ఈ ప్రాంతాల్లో మద్యం సేవించడం, రోడ్ల మీదకు వస్తున్నారు. సాయంత్రమైతే బైక్‌లలో రయ్ రయ్ మంటూ నగరంలో అలజడి సృష్టిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో రౌడీ, మద్యం బాబులు ఆగడాలు ఎక్కువగా కనిపిస్తున్నా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు. ఎక్కడ దాడిచేస్తారోనని, కుటుంబాలు, పిల్లలు ఉన్న వ్యక్తులు భయపడి పోతున్నారు.రాజకీయ నేతలు జోక్యంతో ఇలాంటి వ్యక్తుల పట్ల ఉదాసీనంగా ఉంటున్నారని తెలుస్తోంది. పోలీసుల నిఘా నామమాత్రంగానే కనిపిస్తోంది.

నిఘా నింగిలో కాదు..నేలపై చేయాలి.

ఎస్‌పి కృష్ణకాంత్ ఆదేశాలతో నగర పోలీసులు సిసి కెమెరాల నిఘా పెట్టారు. ఇది కొంత మేరకు ఉపయోగంగా ఉన్నప్పటికీ రాత్రి సమయంలో శివారు ప్రాంతాలు, నగరంలోని పలు కేంద్రాల్లో నిఘా ఉండడం లేదనే విమర్శలున్నాయి. డిఎస్‌పి పి.సింధు ప్రియ ఆదేశాలతో డ్రోన్ కెమెరాలు నిఘాతో, నెల్లూరు పట్టణ, శివారు, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో క్షుణ్ణంగా పరిశీలించి, పట్టణ సమీప ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డకట్ట వేస్తున్నారు. ఇటీవల ఓపెన్ డ్రింకింగ్ పై ఉక్కుపాదం మోపుతూ 48 కేసులు నమోదు చేయడం జరిగింది. క్రైమ్, కొన్ని ఏరియాలపై డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిశితమైన ప్రదేశాలను ముందుగా గుర్తించి, పాడుపడిపోయిన బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, నదీ తీరాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేశారు. భగత్ సింగ్ కాలనీ, టిడ్కో హౌసెస్, జనార్ధన్ రెడ్డి కాలనీ, వెంకటేశ్వరపురం, బోడిగాని తోట, జాకీర్ హుస్సేన్ నగర్, నవాబ్ పేట సెంటర్ నిఘా పెడుతున్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇప్పటి వరకు జిల్లాలో 2500 కెమెరాలు ఏర్పాటు చేసి, మార్చికి 5000 కెమెరాలు ఏర్పాటుకు సన్నాహాలు. చేస్తున్నారు. పోలీసులు చేస్తున్న కృషి బాగున్నప్పటికీ ఆకతాయిలు, మద్యం బాబులు, గంజాయి , బ్లేడ్ బ్యాచ్‌లో నగరంలో మకాం వేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మద్యం సేవించి ఇళ్లల్లోకి వస్తున్నారు. పోలీసులు రౌడీలు, ఆకతాయిలకు కౌన్సిలింగ్ గట్టిగా ఇస్తే తప్ప, భయం ఉండేలా కనిపించడం లేదు. ఎస్‌పి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి, నేరస్తులు, రౌడీలపై ఉక్కుపాదం మోపాలని కోరతున్నారు.

ఫీజుల కోసం యువత 'పోరు'

భారీగా తరలొచ్చిన యువత, విద్యార్థులు - చెల్లించే వరకూ ఉద్యమం చేస్తాం-కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ వైసిపి ఆధ్వర్యంలో బుధవారం యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున కదలి యువత పోరు కార్యాక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక విఆర్‌సి సెంటర్ నుంచి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి నెల్లూరు సిటీ ఇన్‌ఛార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కోవూరు మాజీ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి యువత, విద్యార్థులు తరలొచ్చారు. విఆర్‌సి, జెడ్‌పి మీదుగా కలెక్టరేట్ ప్రధాన ద్వార వద్ద వరకు ర్యాలీ చేశారు. ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలన్న విద్యార్థులు, యువత నినాదాలు చేశారు.. వైసిపిజిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చక పోవడంతో ప్రజాగ్రహానికి గురైందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించక పోవడంతో. చదువులకు దూరం అవుతున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ యువత ఉద్యోగ కల్పన ఏమైనా సాగుతుందా అని ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు కూడా.. చంద్రబాబు ప్రభుత్వం మొండి చేయి చూపించారన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని మరింత మెరుగ్గా.. అమలు చేస్తూ విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రవేశపెట్టారన్నారు. చంద్రబాబు గవర్నమెంట్ లో పెండింగ్ లో పెట్టిన 2 వేల కోట్ల రూపా యల ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను కూడా జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత క్లియర్ చేయడం జరిగిందన్నారు. నేడు కూటమి సర్కార్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇప్పటివరకు విద్యార్థులకు సంబంధించి ఆరు క్వార్టర్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని.. ఇలా అయితే విద్యార్థుల చదువులు ఎలా సాగుతాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలన్న లక్ష్యంతో నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. నిరుద్యో గులకు ఇస్తామన్న రూ.3 వేల రూపాయల నిరుద్యోగ భృతి హామీ.. కేవలం ప్రకటనకే పరిమి తమైందన్నారు. అధికారంలోకి వస్తే 25 వేల పోస్టుల తో మెగా డీఎస్సీ ఇస్తామన్న చంద్రబాబు.. ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత..కేవలం 16 వేల పోస్టులతో డీఎస్సీ ని ప్రకటించి..10 నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు నోటిఫికేషన్ విడుదల చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. అనంతరం జిల్లాలోని ఇతర నియోజకవర్గ సమన్వయకర్తలతో కలిసి..కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జెడ్‌పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, నియోజకవర్గాల సమన్వయకర్తలు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, ఆనం విజయ్ కుమార్ రెడ్డి ,, మేకపాటి రాజగోపాల్ రెడ్డి , కిలివేటి సంజీవయ్య ,బుర్ర మధుసూదన్ యాదవ్, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, మేరిగ మురళిధర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి ఉన్నారు.

కలెక్టరేట్ వద్ద వైసిపి ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం

కొనసాగుతున్న సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు

25వ డివిజన్‌లో..సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రూరల్ నియోజకవర్గం 25వ డివిజన్ బుజ బుజ నెల్లూరు పరిధిలోని కళాకారుల కాలనీ వికలాంగుల కాలనీ ప్రాంతాల్లో నిర్వహించారు. సిపిఎం సభ్యులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కొండా ప్రసాద్, సిపిఎం శాఖ కార్యదర్శి కృష్ణ మూర్తి, ఎస్.వెంకయ్య, తిరుపాలు, టి.శ్రీనివాసలు, బెల్లంకొండ రవి, సుమంత్ పాల్గొన్నారు.

53వ డివిజన్‌లో.. స్థానిక 53వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరపురం ప్రాంతంలో బుధవారం 5వ రోజు ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు.నగరంలో పలుచోట్ల ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్య యాత్రల కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

సిపిఎం నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, మూలం ప్రసాద్, శాఖా కార్యదర్శి గడ్డం శ్రీనివాసులు రెడ్డి, స్థానిక నాయకులు బయన్న, మధు,రవి,మణి, మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు :ఈనెల నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో నగరపాలక సంస్థ మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని మేయర్ స్రవంతి జయవర్ధన్ ఆకాంక్షించారు. కార్పొరేషన్ కార్యాలయం మేయర్ ఛాంబర్‌లో నగరపాలక సంస్థ మున్సిపల్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 1425 మంది విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన స్టేషనరీ సామగ్రిని మేయర్ బుధవారం పంపిణీ చేసారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని 16 మున్సిపల్ హై స్కూళ్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐద్వా జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు : ఐద్వా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరిం చుకోని మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ సెంటర్ నందు జెండా ఆవిష్కరణ నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా అధ్యక్ష. కార్యదర్శులు. షేక్ మస్తాన్ బి. టి శివ కుమారి మాట్లాడుతూ 1981లో కష్ణాజిల్లాలోని ఉయ్యూరులో మార్చి 12వ తేదీన ఐద్వా ఏర్పడిందన్నారు. శ్రీమతి కీర్తిశేషులు మానికొండ సూర్యావతి, మోటూరి ఉదయం ,మల్లు స్వరాజ్యం, పుతుంబాక భారతి, తదితర నాయకులతో ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి మహిళా సమస్యలపై. స్థానిక సమస్యలపై అనేక పోరాటాలు చేసి ఈరోజు అఖిలభారత సంఘంగా వ్యాప్తి చెందిందని తెలిపారు. పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్ కోసం, తండ్రి ఆస్తిలో కుమార్తెకు సమాన హక్కు కోసం, సారా నిషేధం కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. .ఐద్వా జిల్లా నాయకులు ఎన్.వి. సుబ్బమ్మ. షేక్ షంషాద్. కె. సంపూర్ణమ్మ. నగర నాయకులు రెహనుమా. రమణమ్మ. నాగలక్ష్మి ఉన్నారు.

పొగాకు రైతులకు సూచనలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పొగాకు బోర్డు ఒకటో వేలం కేంద్రం పరిధిలోని చెరుకూరులో సిరి యఫ్‌సిఆర్-15 వంగడాల మధ్య ఉత్పత్తి, నాణ్యత లో పోలిక అనే అంశం మీద రైతులకు , సిబ్బంది కి శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహిం చారు. వేలం నిర్వహణ అధికారి ఎమ్ కిరణ్ మాట్లాడుతూ అడుగు ఆకులు వదిలేసి పక్వానికి వచ్చిన వాటిని మాత్రమే రెలచాల న్నారు. ఆకు అల్లిక సమయంలో టార్పాలిన్ పట్టాలు విడిగా వాడాలన్నారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందు బాటులో ఉంచుకొని అన్యపదర్థాలను అందులో వేయాల న్నారు. బ్యారన్‌లో క్యూరోమీటర్ వాడాలన్నారు. దీనివల్ల అగ్ని ప్రమాదాలను నివారించొచ్చన్నారు. సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ శివ కుమార్ మాట్లాడారు. జిపిఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాస రావు, పోలిశెట్టి కంపెనీ ప్రతినిధి శేఖర్ పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేలం నిర్వహణ అధికారి కిరణ్

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు టిఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇంటర్ పరీక్షా కేంద్రంలో 445 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా బుధవారం 17 మంది గైర్హాజరు అయ్యారు.పరీక్షా కేంద్రాన్ని ఆర్‌ఐఒ ఏ.శ్రీనివాసులు , డి ఈ సి సభ్యులు సందర్శించి పరీక్షలు ప్రశాంతంగా బోర్డు నిబంధనల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారని చీఫ్ సూపెరిండెంటెంట్ షేక్ నాగూర్ వలి డిపార్మెంటల్ అధికారి కే వీ నరసింహం తెలిపారు.

పలుచోట్ల పొలం పిలుస్తోంది..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలోని అమ్మవారిపాలెం, గుడ్లూరు-1 రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిల ుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నాయకులు, గ్రామ వ్యవసాయ షారూఖ్ , ఝాన్సి పాల్గొన్నారు.

టిబి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎస్కే ఖాదర్ వలీ ఆధ్వర్యంలో ఎసిఎస్‌ఆర్ మెడికల్ కాలేజీలో నారాయణ మెడికల్ కాలేజీలో కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎసిఎస్‌ఆర్ కాలేజీ, నారాయణ మెడికల్ కాలేజీలో జరిగే ప్రెజెంటివ్ ఎగ్జామినేషన్స్ ని టీబీ నోటిఫికేషన్‌ని , నారాయణ కాలేజీలో,ఏసిఎస్‌ఆర్ మెడికల్ కాలేజీలో ఎన్‌టిఈపి ప్రోగ్రామ్ గురించి వివిధ రకాల అంశాల గురించి చర్చించారు. ప్రతి ఒక్క శాఖ సహకారం రాబోయే మూడు నెలల్లో టిబి ప్రోగ్రామ్‌ను 100 శాతం అచీవ్ చేయాలి సమావేశంలో వివరించారు. వివిధ విభాగాల హెచ్ ఓ డి లు ,ప్రిన్సిపాల్ ,టీబీ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు : కలెక్టరేట్ ఆవరణంలోని గోల్డెన్ జూబ్లీ హాలులో జిల్లా రెవెన్యూ, స్టాటిస్టికల్, సర్వే ఎంప్లా యిస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ను కలెక్టర్ ఓ ఆనంద్ ప్రారంభించారు. బుధవారం గోల్డెన్‌జూబ్లీ హాలు భవనంలో పైఅంతస్తులో ఆధునీకరించిన గదిలో సొసైటీ కార్యాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. తొలుత కలెక్టర్‌కు రెవెన్యూ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డిఆర్ఒ ఉదయభాస్కర్‌రావు, సొసైటీ అధ్యక్షులు చొప్పా రవీంద్రబాబు, గౌరవ సలహాదారు దూబగుంట మధుసూదనశర్మ, కార్యదర్శి శేషయ్య, కోశాధికారి ఆర్. శ్రీనివాసులు, డైరెక్టర్లు వై నాగశేఖర్ ఉన్నారు.

షాదీమంజిల్‌ను అభివృద్ధి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని పెద్దపడుగుపాడులో నిరుపయోగంగా ఉన్న షాదీమంజిల్‌ను అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రజా చైతన్య యాత్ర ఐదో రోజుకు చేరుకుంది. ఈ యాత్ర మండలంలోని పెద్ద పడుగుపాడు గ్రామానికి చేరుకుంది. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిని రాజకీయాలకతీతంగా అందరం కలుపుకొని పోవాలన్నారు. ప్రజాధనం వృథా కాకుండా కాపాడుకోవాలని కోరారు. గతంలో కాటంరెడ్డి రామచంద్రా రెడ్డి నగర్‌లో 1999 లో నిర్మించిన షాదీ మంజిల్ భవనం మైనర్ రిపేర్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీంతో స్థానిక పేద ముస్లిం, బిసిలు శుభకార్యక్రమాలు చేసుకోవడానికి ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రత్యేకంగా వక్ఫ్ బోర్డు నుంచి ప్రభుత్వ సహకారంతో నిధులు కేటాయించగలిగితే దాదాపు 250 మంది కూర్చొని మైనార్టీలు, బీసీలు అతి తక్కువ ఖర్చుతో వివాహాలు జరుపుకోవచ్చునన్నారు. లక్షల రూపాయలను ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం పాలకవర్గాలు నిర్లక్ష్యంవల్ల అభివృద్ధికి నోచుకోలేదనాన్నారు. కనీస రిపేర్లకు కావాల్సిన నిధులు సమీకరించగలిగితే ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావచ్చునని తెలిపారు. సిపిఎం గుర్తించి సమస్యలను అధికారులు, పాలకులు స్పదించేంత వరకు ప్రజలపక్షాన పోరాటం చేస్తామన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య, ఆవాజ్ మండల నాయకులు మహమ్మద్ సర్దార్ అహ్మద్, ఎస్‌కె బాబు, షేక్ అప్రోజ్, చాన్‌బాషా, ఫాతిమా,షేక్ ఎజ్దానీ బాషా, వూటుకూరు వెంకట రమణయ్య, కొమరగిరి శ్రీనివాసులు, గండవరపు సురేష్, విజయ్ కుమార్, రామిశెట్టివెంకటేశ్వర్లు, నూకలపాటి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి మండలి విస్తరణకు నిర్ణయం

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు నియోజక వర్గ అభివద్ధి మండలి ని నియోజక వర్గ స్థాయిలో విస్తరించాలని కమిటీ నిర్ణయించింది. అందులో భాగంగా బుధవారం కందుకూరు కోర్టు కాంప్లెక్స్‌లో బార్ అసోసియేషన్‌లో అడ్వకేట్‌ను కలిసి సమావేశం ఏర్పాటు చేశారు..సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. వి. సుబ్బారావు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి పి. సంపత్ కుమార్, సీనియర్ అడ్వకేట్స్ బెజవాడ కిష్టయ్య చౌదరి, సిహెచ్ హరికష్ణ, శ్రీధర్ నాయుడు, బీవీ మురళీకష్ణ, ప్రసాద్ రెడ్డి అడ్వకేట్స్ హాజరు అయ్యారు.అభివద్ధి మండలి అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజక వర్గం లోని అనేకమంది మేధావులు, ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ పార్టీల ప్రతినిధులు, రైతులు, రైతు కూలీలు, సామాన్య పనివారు, ఇంజనీర్లు, లాయర్లు, డాక్టర్లు ఇలా అనేకమంది అభివద్ధి కాముకుల ప్రతినిధులతో రాజకీయాలకు అతీతంగా ఈ అభివద్ధి మండలి ఏర్పడిందన్నారు. కందుకూరు నియోజక అభివద్దే లక్ష్యం అని, ఏ ఒక్క వ్యక్తికి గాని సమూహనికి గాని, వర్గానికి, కులానికి, మతానికి, రాజకీయ పార్టీస్ కు గాని ఈ అభివద్ధి మండలి వ్యతిరేకంగా ఉండదన్నారు. కందుకూరు కు ప్రాణప్రదమైన రాళ్లపాడు ప్రాజెక్ట్ రిపేర్, నిర్వహణ విషయంలో అటు కలెక్టర్‌తో, ఇటు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో, ప్రాజెక్ట్ దగ్గరి పనివారితో నిరంతరం టచ్ లో ఉంటూ అక్కడ రైతుల మేలుకోసం కషి చేశామన్నారు. ప్రముఖ వ్యాపారి వేత్త కొల్లూరు కొండయ్య తోపాటు అభివద్ధి మండలి ఉపాధ్యక్షులు పాలేటి. కోటేశ్వరరావు, కన్వీనర్లు తోకల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతరబోయిన. నరేష్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన అభివృద్ధి కమిటీ సభ్యులు

కందుకూరు నియోజకవర్గ అభివద్ధి కమిటీ తరపున అమరావతిలో హెల్త్ మినిస్టర్ సత్య ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.కందుకూరు నియోజకవర్గం లోని పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గ అభివద్ధి కమిటీ అధ్యక్షులు, నాయకులు డాక్టర్ ది వి శివరాం, పొడపోటి శ్రీనివాసరావు, తోకల వెంకటేశ్వర్లు ఉన్నారు.



లాయర్లతో సమావేశమైన అభివృద్ధి మండలి నేతలు



మంత్రిని కలిసిన అభివృద్ధి కమిటీ సభ్యులు

పలుచోట్ల వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కందుకూరులో..

ప్రజాశక్తి-కందుకూరు : వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కందుకూరులో ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కందుకూరు పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వైసిపి జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ వైసిపి పేదల కోసం పుట్టిన పార్టీ అని కొనియాడారు. 2029లో లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు :వైసిపి 15 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుడ్లూరు బస్టాండ్ సెంటర్లో ఆ పార్టీ జెండాను ఎగరవేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైసిపి అభిమాని ఒంగోలు సోనియా జెండా ఆవిష్కరించి కేకు కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంచారు. మండల వైసిపి అధ్యక్షులు కాపులూరు కష్ణ యాదవ్ చిట్యాల రవికుమార్ గొర్ల రమేష్ బాబు, బిల్లా రమణయ్య షాకీర్ ఉన్నారు.

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ 15 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. వైసిపి మండల కన్వీనర్ అను మూల లక్ష్మీ నరసింహ పార్టీ జెండాను ఎగురవేశారు. లక్ష్మీనరసింహ మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేశారు. వైసిపి నాయకులు కాకు వెంకటస్వామి, చింతలపూడి రవీంద్ర, కట్ట హనుమంతరావ పొట్టేళ్ల కష్టయ్య నాగిరెడ్డి శివరామిరెడ్డి గుత్తా గోపి పరిటాల సింగయ్య ప్రగడ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - లింగసముద్రం : వైసిపి 15వ ఆవిర్భవ దినోత్సవాన్ని లింగసముద్రంలో వైసిపి మండల కన్వీనర్ నోటి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం వైసిపి మండల కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య సమాధి దగ్గర ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహానికి వైసిపి మండల కన్వీనర్ వెంకటేశ్వర రెడ్డి నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన భారీ కేకులు కట్ చేశారు. జిల్లా ట్రెజరర్ సెక్రెటరీ ఆర్గనైజర్ పిచ్చపాటి తిరుపతి రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షఫీ,సర్పంచ్ పులి పెద్ద రాఘవులు,గొర్రెపాటి చెంచురామయ్య,ఎంపీటీసీ దగ్గ వెంకటేశ్వర్లు,సర్పంచ్ డబ్బుగోట్టు మల్లికార్జున,గారపాటి మహేంద్ర, కిలారి సురేంద్ర,పెన్నా రమణయ్య, ఉండేలా ఆదినారాయణరెడ్డి, చీమల శ్రీనివాసులు యాదవ్, బట్టరుశెట్టి రాఘవ నాయుడు, కళ్లగుంట ప్రసాద్, వంకదారి అనిల్, గనగనపల్లి లక్ష్మీనారా యణ రెడ్డి,కోమ్మి పోతు లూరయ్య, కిలారి మల్లికార్జున ఉన్నారు.

వలేటివారిపాలెంలో..

గుడ్లూరులో..

లింగసముద్రంలో..

మాట్లాడుతున్న కిమ్స్ వైద్యులు

'కిమ్స్'లో అత్యాధునిక చికిత్సలు విజయవంతం

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగంలో ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టరు సిఎస్ శ్రీనివాసరాజు రాష్ట్రంలోనే తొలిసారిగా బైఫర్కేషన్ స్టంటింగ్ అనే అత్యంత అరుదైన చికిత్స విజయవంతంగా నిర్వహించారు. బుధవారం కిమ్స్ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని నవాబుపేట ప్రాంతానికి చెందిన 54 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి విపరీతమైన గుండె నొప్పితో వైద్యచికిత్సల నిమిత్తం ఈ నెల 6వ తేదిన వచ్చారన్నారు. ఆస మయంలో డాక్టరు సిఎస్ శ్రీనివాసరాజు పరీక్షలు నిర్వహించగా గుండెకు ఎడమవైపు ఉన్న ప్రధాన రక్తనాళం విభజన ప్రాంతంలో రెండువైపులా రక్తనాళాలు పూడుకుపోయినట్లు గుర్తించారన్నారు. బైపాస్ ఆపరేషన్ అవసరమైన ఈ సమస్యకు ప్రత్యేకమైన స్టంట్లతో ఆపరేషన్, అదనపు ఖర్చు లేకుండా పేషంటుకు చికిత్సలందించామన్నారు. పేషంట్ ఆరోగ్యం నిలకడగా ఉండడం తో ఈ నెల 8వ తేదిన డిశ్చార్జ్ చేశామన్నారు. ఇటువంటి అరుదైన, క్లిష్టమైన చికిత్సా విధానాన్ని విజయవంతం చేసినందుకు డాక్టరు సి. ఎస్. శ్రీనివాస రాజుకి, డాక్టరు సాహెబ్ వీర్, డాక్టరు హెచ్. నాగరాజు, డాక్టరు పి. లోకేశ్వర రావు, అనస్థీషియన్ డాక్టరు కె. అశోక్‌కి, క్యాథ్ ల్యాబ్ టెక్నీషి యన్స్ నర్సింగ్ సిబ్బంది, క్యాథ్ ల్యాబ్ సిబ్బందికి హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. గిరి నాయుడు అభినందనలు తెలిపారు.

యూత్ పార్లమెంట్‌లో పాల్గొనాలి

ప్రజాశక్తి-నెల్లూరు :వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025 లో 18 నుంచి 25 ఏళ్ల వయసుగల యువకులు పాల్గొనాలని కలెక్టర్ ఓ ఆనంద్ కోరారు. యువత వారి యొక్క ఆలోచనలు దేశాభివద్ధికి వారికున్న ప్రణాళికను పంచుకోవటానికి ఈ యూత్ పార్లమెంట్ 2025 ఒక మంచి వేదిక అన్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టరు వారి కార్యాలయం లో ఆవిష్కరించారు. పూర్తి వివరాల కోసం ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం (8187814140) , నెహ్రూ యువ కేంద్ర డిస్టిక్ యూత్ ఆఫీసర్ డాక్టర్ ఏ మహేందర్రెడ్డి (99635 33440) నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగించొద్దు

ప్రజాశక్తి-నెల్లూరు :రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నిషేధిత సింగల్ యూస్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను కార్పొరేషన్ పరిధిలో వినియోగించొద్దని, ప్రత్యామ్నాయంగా జౌళి, నార, గుడ్డ సంచులను వాడాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 50వ డివిజన్ పినాకిని పార్క్, రంగనాయకులపేట, ఉప్పరపాలెం తదితర ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించారు.నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్. ఇ. రామ్ మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్ను డు, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా ఉన్నారు.

ప్రణాళిక రూప కల్పనపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలోని అన్ని నియోజకవర్గాల స్థాయి స్వర్ణాంధ్ర - 2047 ప్రణాళిక తయారులో నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు శ్రద్ధ తీసు కోవాలని కలెక్టర్ ఒ ఆనంద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - 2047 యాక్షన్ ప్లాన్ ను నియోజ కవర్గ స్థాయిలో తయారు చేసేందుకు , జి డి డి పి (స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి) పై వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులకు కార్యశాల (వర్క్ షాప్) జిల్లా ప్రణాళిక శాఖ అధికారి నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరం 2025-26 నకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి స్థూల నియోజకవర్గ దేశీయ ఉత్పత్తి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ, నెల్లూరు, ఆత్మకూరు, కావలి ఆర్డీవోలు అనూష, పావని, వంశీకష్ణ ఉన్నారు.

'యువత పోరు'కు తరలిన నేతలు

ప్రజాశక్తి-ఉదయగిరి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగే యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు బుధవారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9నెలలు గడుస్తున్న యువతకు విద్యార్థిని విద్యార్థులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఈ సందర్భంగా చేపట్టిన యువ పోరు కార్యక్రమంకు నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో వైసిపి నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ముందుగా ఉదయగిరి స్థానిక పెట్రోల్ బంక్ ఆవరణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వైఎస్ఆర్ అమరహే వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలతో పరిసర ప్రాంతం మారుమోగిస్తూ తరలి వెళ్లారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిఎం ఓబుల్ రెడ్డి, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, సీనియర్ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు షంషేర్, మాజీ వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఎస్దాని, మాజీ సర్పంచ్ అక్కుల్ రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు నల్లిపోగు ప్రసాద్, యువ నాయకులు పవన్, ప్రవీణ్, రాజేష్, ఇత్తడి రమణయ్య, గురవయ్య, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-సీతారామపురం : సీతారాంపురం జాతీయ రహదారి మార్గం మధ్యలో భైరవకోన నుంచి సీతారామపురం వస్తున్న ఆటో అదుపుతప్పి జాతీయ రహదారి పనుల నిమిత్తం పక్కనే తోలి ఉన్న రాళ్లగుట్ట పైకి ఎక్కడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. వైద్యం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆహారం అందజేత

ప్రజాశక్తి-బిట్రగుంట : మానవసేవే మాధవసేవ అని బిఎంఆర్ యువసేన అధ్యక్షుడు షేక్.సమీఉల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామానికి చెందిన కైపు వెంకటేశ్వర్ రెడ్డి, సతీమణి వారి పెద్దకర్మ ఫంక్షన్‌లో ఆహారం మిగిలి ఉందని వారి కుటుంబ సభ్యులు తెలపడంతో వారి గృహానికి వెళ్లి ఆహారాన్ని సేకరించి భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలోని అనాథలకు అందించమని తెలిపారు. మండలం ఎక్కడైనా ఆహారం మిగిలితే మా నెంబర్ 9885627377 నెంబర్ కాల్ చేయాలని కోరారు. కుటుంబ సభ్యులు కోట జనార్దన్ రెడ్డి, కైపు అనిల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : పొదుపు సంఘాల బలోపేతమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గుంపర్లపాడు గ్రామంలో నెలవారి సంఘ బంధం మీటింగు విఒఎ అధ్యక్షురాలు అధ్యక్షతన వెలుగు ఎపిఎం సతీష్ కుమార్, సిసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలలో పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సక్రమంగా నెలవారి చెల్లింపులు చేయాలని, అదేవిధంగా శ్రీనిధి రుణాలను విఒఎలకు చెల్లించాలని, ప్రతినెలా పొదుపు చెల్లించాలని, విఒఎలతో సమావేశ పుస్తకాలను రాయించుకోవాలని, మొబైల్ బుక్ కీపింగ్ చేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సిసి పి.పెంచలమ్మ, పొదుపు మహిళలు, విఒఎ శ్రావణి హాజరయ్యారు.

'స్వచ్ఛాంధ్ర'పై అవగాహన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట గ్రామ పంచాయతీలోని గండువారిపల్లి, చందలూరు పాడు, బిసికాలనీ, దర్గా సెంటర్, ప్రాంతాలలోని గ్రామస్తులకు పంచాయతీ కార్యదర్శులు షరీఫ్, వినాయక్ స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని పలు వీధులలో ప్రతి ఇంటికి తిరుగుతూ, ఇచ్చిన చెత్త బుట్టలో చెత్తను, తడి చెత్త పొడి చెత్తలను వేరువేరుగా విభజించి, చెత్త సేకరణ వాహనాలకే వ్యర్థాలను అందించాలని, అలాకాకుండా బహిరంగ ప్రదేశాల్లో వేసే వారిని గుర్తించి జరిమానాన్ని విధిస్తామని తెలియజేశారు. అంతేకాకుండా షాపు యజమానులు తప్పనిసరిగా చెత్తకు సంబంధించి బుట్టలను ఏర్పాటు చేసుకొని చెత్త సేకరణ వాహనం వచ్చిన తరువాత వేయాలని రోడ్ల పైన టీకప్పులు ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా దర్గాసెంటర్లో వేస్తున్నారని తమకు పలువురు తెలియజేసి ఉన్నారన్నారు. ఇకపై అలా జరగకుండా చూసుకోవాలని అలా చేసిన వారికి జరిమానా విధిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఆయుష్‌శాఖ సేవలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండ బిట్రగుంట వెలసి ఉన్న బిలకూట క్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసే భక్తులకు ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆయుర్వేద మందులను ఆర్‌డిడి ఆయుష్ శాఖ డాక్టర్లు కొర్ర చంద్రశేఖర్, డాక్టర్ ఎస్.కె.హాలీ మౌలాలి, డాక్టర్ కె.కృష్ణయ్య, డాక్టర్ రాజనర్సింహ, డాక్టర్ శ్రీరేఖ వైద్యసిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో భక్తులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఆయుష్ శాఖ వారు వైద్య శిబిరం ఏర్పాటు చేసి 375 భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్ రెడ్డి, ఆర్ డి డి ఆయుష్ వైద్య శాఖ ఒంగోలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లా శ్రీనివాసులు రెడ్డి నియామకం

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడిగా కావలి పట్టణ 34వ వార్డు ఇన్‌ఛార్జ్ పుల్లా శ్రీనివాసులు రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. వైసిపి పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా కావలి పట్టణ 34వ వార్డు ఇన్‌ఛార్జ్‌గా విశేష సేవలు అందించిన శ్రీనివాసుల రెడ్డిని పార్టీలో మరింత సేవలను ఉపయోగించుకోవాలనే ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియమించడం జరిగింది. అయితే ఈ సందర్భంగా పుల్లా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పార్టీ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని శ్రీనివాసుల రెడ్డి తెలియజేశారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మర్రిపాడు : మహిళా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం బిసి కుటుంబాలకు చెందిన మహిళలకు సంబంధిత కార్పొరేషన్ ద్వారా టైలరింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని ఎంపిడిఒ వై నాగేశ్వర ప్రసాద్ తెలిపారు. 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగి, తెల్ల రేషన్ కార్డు ,ఆధార్, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు కలిగిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అర్హులన్నారు. శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునేవారు 45 రోజులు– 8 గంటలు లేదా 60 రోజులు– 6 గంటలు లేదా 90 రోజులు–4గంటలు శిక్షణ కాలాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎంపిక చేయబడిన లబ్ధిదారులలో 75శాతం పైగా హాజరు కలిగి పూర్తిస్థాయి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్, కుట్టుమిషన్ ఉచితంగా అందజేస్తారన్నారు. మహిళలు సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం బిసి, కాపు, ఈబిసి, కమ్మ, రెడ్డి ఆర్యవైశ్య క్షత్రియ, బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన మహిళలకు సంబంధిత కార్పొరేషన్ ద్వారా టైలరింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని ఎంపిడిఒ ప్రత్యూష తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగి, తెల్ల రేషన్ కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు కలిగిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అర్హత కలిగి ఉంటారన్నారు. ఆసక్తి గల మహిళలు మండలంలోని అన్ని సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జనసేన వేడుకలకు తరలిరావాలి



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని గ్రామాలలోని జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు నాయకులు తరలిరావాలని ఆ పార్టీ కమిటీ సభ్యులు ఊట వెంకట్రావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచన మేరకు, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆత్మకూరు నుంచి పిఠాపురం సభ్యులకు 4గంటలకు బస్సులు బయల్దేరుతాయని జనసైనికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి-కలిగిరి : పిఠాపురంలో మార్చి 14న జరగబోయే జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ విజయవంతం చేయాలని మండల జనసేన అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కలిగిరిలోని ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ప్లీనరీ సమావేశం కనుక మండలంలోని జనసైనికులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ అధిక సంఖ్యలో తరలి వెళ్లి ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పలుచోట్ల సిపిఎం ప్రజాచైతన్యయాత్రలు

మాట్లాడుతున్న ఆలూరు తిరుపాలు

ప్రజాశక్తి-నెల్లూరు

సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రల ఐదవ రోజు పర్యటనలో భాగంగా నెల్లూరు రూరల్ మండలంలోని మట్టెంపాడు, మొగళ్ళపాలెం గ్రామాలలో పర్యటించారు. మొదటగా రాచమల్లు రమేష్ దొంగ పట్టాలతో ఆక్రమించిన భూములను అనంతరం మొగళ్ళపాలెంలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్ మాట్లాడుతూ రాచమల్లు రమేష్‌కు ఎలాంటి హక్కులు లేకపోయినా ఒకచోట 15 ఎకరాలను ఆక్రమించి మామిడి మొక్కలు నాటి అమ్మేశాడని మరోచోట ఊర్లోకి పోయే 20 అడుగుల వెడల్పు ఉన్న దారిని ఆక్రమించి గెస్ట్‌హౌస్ నిర్మిస్తున్నాడని 20 ఎకరాలు చుట్టూ ఫెన్సింగ్ వేశాడని, నెల్లూరు రూరల్ తహశీల్దారు 145 సెక్షన్ విధించినప్పటికీ పనులు జరుగుతూ ఉండడం దుర్మార్గమని కాబట్టి ఇక్కడ నుంచి అతనిని వెంటనే ఖాళీ చేయించాలన్నారు. మొగళ్లపాలెంలో శాప్ నిధులతో నిర్మించిన షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాలు పూర్తయి ఉన్నాయని వీటిని క్రీడాకారుల ట్రైనింగ్ కోసం వెంటనే అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు రూరల్ మండలం కమిటీ సభ్యులు ఎంవి రమణ, గుంటి నాగరాజు, గుడి రవీంద్ర, శ్రీపతి దయాకర్, శ్రీపతి వెంకట శేషయ్య, తాళ్లూరు రాజా, కవిలి సురేష్, గిరిబాబు, గ్రామస్తులు గుంజి వెంకట్రాయలు, దాసరి సుమన్, తదితరులున్నారు.

ప్రజాశక్తి-ముత్తుకూరు : మండలంలోని నార్కెలపల్లి గ్రామంలో బుధవారం సిపిఎం నాయకులు ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల పాల్గొని సిపిఎం మండల కమిటీ దృష్టికి స్థానిక సమస్యలు తీసుకువచ్చారు. ప్రధానంగా సాగరమాల నేషనల్ హైవే రోడ్డుకు తీసుకున్న భూములకు నష్ట పరిహారం పూర్తిగా చెల్లించలేదని ఈ రోడ్డుకు తోలుతున్న యాష్ వల్ల గ్రామం మొత్తం బూడిదమయం అయిపోతుందని ప్రజలు వాపోయారు. చుట్టూ పామాయిల్ ఫ్యాక్టరీలు కృష్ణపట్నం పోర్టు కారణంగా దుమ్ము ధూళి బూడిదతో అల్లాడిపోతున్నామని తాగడానికి మంచి నీళ్లు లేవని రోడ్లో డ్రెయినేజీ లేదని ఇళ్ల స్థలాలు రేషన్ కార్డులు లేవని అక్కడ ప్రజలు సిపిఎం ప్రజా చైతన్య యాత్ర దృష్టికి సమస్యలు తీసుకువచ్చారు. పెండింగ్లో ఉన్న మత్స్యకారేతర ప్యాకేజీ బ్యాలెన్స్‌ను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య, మండల కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ సా, రమణమ్మ, రాగమ్మ, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గడ్డం అంకయ్య

ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఉదయగిరి : 14వ తేదీ నుండి ఉదయగిరి సీతారాంపురం వరికుంటపాడు మండలాల ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సిపిఎం చేపట్టే ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 8వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఉదయగిరి ప్రాంతీయ మండలాలలో 14వ తేదీ నుండి స్థానిక సమస్యలపై ఎన్నికల హామీలలో కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి ఇచ్చిన హామీలను ప్రజలకు వివరిస్తూ చేపట్టేయాత్రను ప్రతిఒక్కరూ కలిసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం కాకు వెంకటయ్య మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో అనాదిగా వివక్షతకు గురవుతూ వలసలకే ప్రధానమైన ఉదయగిరి అభివృద్ధికి సాగు, తాగునీరు అందిస్తూ గాలిలో కలుస్తున్న ప్రాణాలను కాపాడేందుకు ఉదయగిరి నందవరం డబుల్‌రోడ్డు నిర్మాణం కొండకిందపల్లెల ఘాట్ రోడ్ నిర్మాణాన్ని నిర్మించాలన్నారు. ప్రధానమైన సాగు, తాగునీరుకు వెలుగొండలో అంతర్భాగమైన సీతారాంసాగర్ పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ సమస్యకు జరుగుతున్న బడ్జెట్లో రూ.7వేల కోట్లను మంజూరు చేసి మెట్టప్రాంత వాసులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సభ్యులు పందిళ్ళ వెంకటేశ్వర్లు, పచ్చవ వెంకటేశ్వర్లు, వెంకటరమణ, తదితరులున్నారు.

అసెంబ్లీలో ఎంఎల్ఎ కాకర్ల గళం

ప్రజాశక్తి-ఉదయగిరి

అమరావతిలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాలలో శాసనసభ్యులు కాకర్ల సురేష్,ఆత్మకూరు ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని ఆర్ అండ్ బి రోడ్లు, క్రీడా వికాస కేంద్రం, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లపై తమ వాణి వినిపించారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో జీరో ఓవర్‌లో ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుండి సుమారు 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ ఉదయగిరి ప్రాంతానికి గత 40 సంవత్సరాలుగా సరైన రహదారి లేదని ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలను కలుపుతూ జిల్లా కేంద్రానికి వెళ్లే ఉదయగిరి టు నందవరం, నెల్లూరు పాలెం, టు వింజమూరు, సంగం టు కలిగిరి రోడ్లను డబల్ రూట్‌గా విస్తరించి వేయాలని, రోడ్డు రవాణా శాఖ మంత్రిని సభాపతి ద్వారా కోరారు. అదేవిధంగా ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు అక్టోబర్ నుండి ఆన్‌లైన్ లాగిన్ ఉందని, అంతకుముందు పింఛన్లకు కూడా లాగిన్ వచ్చే విధంగా చూడాలని సభ దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా వెనకబడిన సీతారాంపురం మండలంలో క్రీడాకారుల అభ్యున్నతి కోసం క్రీడా వికాస కేంద్రం మంజూరు చేశారని, ఒక కోటి 60 లక్షల రూపాయలతో నిర్మించిన భవనాలు హైవే రోడ్డు విస్తీర్ణంలో కూల్చివేశారని, అందుచేత మరో కోటి 80 లక్షలు మంజూరు చేయాలని సభాపతి ద్వారా మంత్రిని కోరారు. ఎన్నడూ లేని విధంగా అసెంబ్లీ సమావేశాలలో ఉదయగిరి వాణి వినిపిస్తున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌ను మేధావుల సైతం అభినందిస్తున్నారు.

ఎంఎల్ఎను కలిసిన ఎంఎల్‌సి బీద

ప్రజాశక్తి-కావలి : కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని బుధవారం కావలి వారి నివాసంలో టిడిపి జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. తాను ఎంఎల్‌సిగా ఎన్నికవడంలో సహకరించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. బీద రవిచంద్రను ఎం.ఎల్.ఎ. క్రిష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. ఎంఎల్‌సిగా గెలుపొందినందుకు రవిచంద్రకు శుభాకాంక్షలు తెలియజేశారు.

బ్యాంకు లోన్‌పై అధిక వడ్డీ

ప్రజాశక్తి-సీతారామపురం : బ్యాంకు అధికారులు తనకు అధిక వడ్డీ వేసి దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఓ బాధితుడు తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గంధంవారి పల్లి మహేంద్రరెడ్డి అనే సన్నకారు రైతూ వ్యసాయం అవసరం నిమిత్తం భూమిని మార్టెజ్ కింద ఋణం తీసుకున్నారు. అప్పుడు వడ్డీ 0.90పైసలుగా చెప్పారని, ఇప్పుడు బ్యాంకు సిబ్బంది ఫోన్ చేసి అధిక వడ్డీ కట్టమని దురుసుగా ప్రవాతస్తున్నారు. ఉదయగిరి సొసైటీ బ్యాంకు మేనేజర్‌పై మీడియాతో మహేంద్ర రెడ్డి అని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు..



ప్రజాశక్తి-సంగం

పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురకావొద్దని ప్రధానోపాధ్యాయులు ఎస్.నరసింహామూర్తి అన్నారు. సంగం మండలం మర్రిపాడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతి పూజ ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ పరీక్షలు రాస్తున్న సమయంలో ఎటువంటి ఒత్తిళ్లకు లోనవ్వకుండా పరీక్షలు రాయాలన్నారు. ముందుగా క్వశ్చన్ పేపర్ నెమ్మదిగా చదివి తర్వాతే తగిన జవాబులు రాయాలన్నారు. సరస్వతి దేవి పాదాలపై కొంతసేపు హాల్ టికెట్ను ఉంచడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా మర్రిపాడు గ్రామానికి చెందిన రవిచంద్ర తన స్నేహితులతో కలిసి 52మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారన్నారు. పదవ తరగతి విద్యార్థులను ఎటువంటి భయభ్రాంతులకు గురికాకుండా పరీక్షలు రాయాలని మండలంలో ప్రథమ స్థానంలో మన స్కూలు ఉండాలంటూ వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఇతర తరగతుల విద్యార్థులందరూ వారికి వీడ్కోలు తెలిపారు. కార్యక్రమంలో స్కూలు సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి రావిళ్ల నాగేశ్వరరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా

సరస్వతి పూజ కార్యక్రమాన్ని పచ్చవ లక్ష్మయ్య కుమారులు భూమయ్య, చిన్న వెంగయ్య, పెద్ద వెంగయ్య వారి సొంత నిధులతో నిర్వహించారు. పచ్చవ లక్ష్మయ్య 1999 సంవత్సరం నుంచి ప్రతియేటా విద్యార్థుల కోసం సరస్వతి పూజ సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అన్నప్రసాద కార్యక్రమం వారి సొంత నిధులతో నిర్వహించేవారన్నారు. అదేవిధంగా గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి ప్రజలకు చేదోడు వాదోడుగా లక్ష్మయ్య నిలిచారు. ఆయన బాటలోనే ఆయన తనయులు కూడా గ్రామానికి ఏదోకటి చేయాలని దృఢ సంకల్పంతో పాఠశాల అభివృద్ధి కోసం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పచ్చవ లక్ష్మయ్య కుమారులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందిస్తున్నారు.

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని చాగలకొండ రాధాకృష్ణ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులతో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. 17వ తేదీ నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులైన మబ్బు వెంకటప్రసాద్ లాస్య స్టూడియో అధినేత ప్రముఖ వ్యాపారవేత్త కాకర్ల మాల్యాద్రి విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామాగ్రిని అందజేశారు. ప్రస్తుతం చదువుతున్న పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు పారితోషకం ఇచ్చి సత్కరిస్తామని తెలిపారు.



ప్రజాశక్తి-మర్రిపాడు : మర్రిపాడు జెడ్‌పి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పెసల శ్రీను దాతృత్వంతో మాడుపూడు సుబ్బరాయుడు సహకారంతో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 17న జరగబోయే 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు అధైర్య పడకుండా పరీక్షలు రాసి వందశాతం సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠశాల సిబ్బంది దాతను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని స్థానిక గౌతమి స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులు బుధవారం సరస్వతి పూజను ఘనంగా నిర్వహించినట్లు హెడ్ మాస్టర్ భాస్కర్ రెడ్డి తెలియజేశారు. ముందుగా సరస్వతి పూజ చేసి మధ్యాహ్నం భోజనాలు చేశారు. తదనంతరం విద్యార్థుల తీపు జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-వరికుంటపాడు

లింగాకర్షణ బుట్టలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని వ్యవసాయ అధికారి రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని ఇస్కపల్లి, గొల్లపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రవికుమార్ మాట్లాడుతూ సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులలో భాగంగా రైతులు పొలాలలో లింగాకర్షక బుట్టలు వాడినట్లయితే రెక్కల పురుగుల ఉనికిని అంచనా వేసి సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు రసాయనిక మందులు పిచికారి చేసుకునే సంఖ్యని కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ లింగాకర్షక బుట్టలలో ఉండే రసాయనిక పదార్థానికి మగ రెక్కల పురుగులు ఆకర్షింపబడి, బుట్టలలో బంధింప పడటం వల్ల, పంట పొలాల్లో ఉండే ఆడ రెక్కల పురుగులు సంతానోత్పత్తి చేయకుండా నివారించవచ్చని తెలిపారు. ఈ విధంగా లింగాకర్షక బుట్టలు వాడటం వల్ల పురుగుల ఉనికిని తెలుసుకోవడంతో పాటు వాటి సంతతిని అదుపులో ఉంచి పంటలను రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పొగాకు లద్దె పురుగు లింగాకర్షణ బుట్టలను రైతులకు పంచి మినుము పొలాలలో అమర్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఆదిత్య, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ పరిధిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేసినట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ తెలిపారు. 14, 19 వార్డులు, 100 అడుగుల రోడ్డు, ఎస్.ఆర్.కళ్యాణ మండపంలో అందరి పరిసర ప్రాంతాలలో పారిశుధ్య విభాగం వారితో గ్యాంగ్ వర్క్ నిర్వహించారు.

రైతుకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-కావలి

కావలి రూరల్ మండలం తాళ్ల పాలెంలో వైసిపి నేత అభిషేక్ రెడ్డి దౌర్జన్యాలు వేగలేక పొలం వద్ద పురుగుల మందు తాగిన రైతు శివ ప్రసాద్‌రెడ్డి ఆయన భార్య లక్ష్మీకాంతమ్మలను బుధవారం మెరుగైన వైద్య చికిత్స కోసం కావలి ఉమాచంద్ ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి బుధవారం ఉమాచంద్ హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న శివప్రసాద్ రెడ్డి ఆయన భార్య లక్ష్మీకాంతములను పరామర్శించారు. ధైర్యం చెప్పి, తప్పకుండా న్యాయం జరుగుతుందని అండగా ఉంటామన్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ ఉమాచంద్‌ను కోరారు.

అందుబాటులో టీకాలు

ప్రజాశక్తి-మర్రిపాడు : పశువులలో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ గురుజయంతి తెలియజేశారు. బుధవారం ఆమె మర్రిపాడులో మాట్లాడుతూ మార్చి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మూడు నెలలు దాటిన దూడల నుండి పెద్ద పశువుల వరకు ఈ టీకాలు వేస్తామన్నారు. టీకాలు వేయడం ద్వారా గాలికుంటు వ్యాధి పూర్తిగా తగ్గి గేదెలు సమృద్ధిగా పాలు ఇస్తాయన్నారు.

వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వేడుకలు జరుపుకుంటున్న వైసిపి నాయకులు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆత్మకూరులోని మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారీస్థాయిలో బాణాసంచా కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన సమయంలో రాష్ట్రాన్ని వెలుగుబాటలో నడిపించాలని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2011 మార్చి 12న వైసిపిని ప్రారంభించారన్నారు. విపత్కర పరిస్థితుల్లో పార్టీని ఏర్పాటు చేసి పార్టీ అధికారంలోకి వచ్చే వరకు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని, 2019 ఎన్నికల్లో కొత్త చరిత్రనే సృష్టించారని పేర్కొన్నారు. తండ్రి తరహాలో ప్రజాభిమానం పొందిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజలకు సంక్షేమ పాలన అందించారని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామిలను నెరవేర్చకుండా ప్రజలు పోరాటాలు చేస్తూ రోడ్ల పైకి వచ్చేలా పాలన సాగిస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, చెప్పిన ప్రతి హామీని ప్రజలకు చేసేలా పోరాటాలు సాగిస్తామన్నారు. వైసిపి ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామిలన్నింటినీ అమలు చేసేలా వైసిపి ప్రజలతో నిలిచి పోరాటం చేస్తుందన్నారు. నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇలా ప్రజలకు ఏ అవసరమొచ్చినా వైసిపి అండగా నిలుస్తుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి ప్రతిఒక్క కార్యకర్తకు అండగా నిలిచేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డిలు సిద్ధంగా ఉన్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ధైర్యంగా ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అంతకు ముందుగా పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న పలువురు నాయకులు, కార్యకర్తలను, జిల్లా, నియోజకవర్గ స్థాయి పార్టీ పదవులు పొందిన వారిని పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి పార్టీ కండువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి, నియోజకవర్గ మహిళా కన్వీనర్, జెడ్‌పిటిసి పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, జిల్లా యాక్టివిస్ట్ సెక్రటరి పులిమి రమేష్ రెడ్డి, మర్రిపాడు మండల కన్వీనర్ చెన్ను వెంకటేశ్వరరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, నియోజకవర్గ పలు విభాగాల అధ్యక్షులు నందా ఓబులేసు, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, నందవరం ప్రసాద్, మాజీ ఎస్‌సిసెల్ జిల్లా అధ్యక్షులు కొండా వెంకటేశ్వర్లు, భారీస్థాయిలో నియోజకవర్గ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

శ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, గూడూరు లో
O.S.NO.102/2024

M/S SS Agromart,
Rep, by its proprietor
Muppala Swathi Lakshmi. ...Plaintiff
Vs
Yeguru Ramanaiah. S/o. Narasaiah,
Gonu Narasayapalem Village, Yepinapi Panchayath,
Rapuru Mandal, Tirupati District. ...Defendant.
To
Yeguru Ramanaiah. S/o. Narasaiah,
Gonu Narasayapalem Village, Yepinapi Panchayath,
Rapuru Mandal, Tirupati District.

నోటీసు

ఇందుమూలముగా పై తెలిపిన ప్రతివాదికి తెలియచేయుట ఏమనగా పై దావలోని వాది ప్రతివాది మీద తనకు రావలసిన డబ్బు రికవరీ కొరకు దావా వేసియున్నారు. పై దావా మీ నోటీసుకు గాను తే.04-04-2025 ది కు వాయిదా వేసి యున్నారు. కావున ఆ రోజు మీరు ఉ.10.30 ని.పై కోర్టులో హాజరు అయి మీ సంజాయిషీ తెలుపుకోనేది లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు
పి. భాగ్యలక్ష్మి., ఎల్ఎల్.బి.,
అడ్వకేట్, గూడూరు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : GUDUR
E.P.No.21/2023
O.S.No.152/2017

Gangavarapu Dhayakar - D.H.R.
Vs
1.**Thalluru Venkata Krishnaiah** - J.D.R.
2.**Thalluru Narasimha Rao**
- Respondent / Universal Donee.

Notice to 1st J.D.R.

Thalluru Venkata Krishnaiah,
S/o Venkaiah, resident of Lakshminara simhapuram Village, Piduru Post,
Manubolu Mandalam,
SPSR Nellore District.

పై నెంబరున డిక్రీ హోల్డర్ పై తెలిపిన కోర్టులో మీపై ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.లో మీకు నోటీసు నిమిత్తం తే **28-03-2025** దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామా ధమరేశ్వర్
కె.కొండలరావ్
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్స్, నెల్లూరు.

In The Court of The 1st Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 1061 / 2023

Pachari Subramanyam - Plaintiff
Vs
Vallepu Subramanyam - Defendant

Notice to Defendant

Vallepu Subramanyam,
S/o **Ankaiah,**
R/o D.No.2-7-117, Bagath Singh Colony,
Iskapalem Panchayat, Buchireddypalem-524 305, SPSR Nellore District, A.P.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే20-03-2025** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

బి.వి.సుధీర్ కుమార్, B.Com., L.L.B.,
జె.శ్రీనివాసు, B.Com., L.L.B.,
వాది తరపు న్యాయవాదులు, నెల్లూరు.

In The Court of The 1st Addl. Junior Civil Judge : Nellore
I.A.No. 664 / 2023
O.S.No. 1061 / 2023

Pachari Subramanyam
- Ptitioner / Plaintiff
Vs
Vallepu Subramanyam
- Respondent / Defendant

Notice to Respondent / Defendant

Vallepu Subramanyam,
S/o **Ankaiah,**
R/o D.No.2-7-117, Bagath Singh Colony,
Iskapalem Panchayat, Buchireddypalem-524 305, SPSR Nellore District, A.P.

పై నెంబరు కేసులో పిటిషనర్ / వాది మీమీద పై వారి కోర్టులో I.A.No.664/ 2023 పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే20-03-2025** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

బి.వి.సుధీర్ కుమార్, B.Com., L.L.B.,
జె.శ్రీనివాసు, B.Com., L.L.B.,
పిటిషనర్/వాది తరపు న్యాయవాదులు, నెల్లూరు.

వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

జిల్లా వైసిపి కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు. నిర్వహించారు. జెండాను ఎగరవేసి, వైఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. , అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్సి మేరిగ మురళీధర్ , మాజీ శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య, మాజీ రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి పాటు, పెద్ద ఎత్తున పాల్గొన్న వైసిపి నాయకులు, కార్యకర్తలు, పార్టీ మండల కన్వీనర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా రీసర్వే చేపట్టండి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మండలంలోని ఇస్కపాలెం పంచాయతీ పల్లాపల్లి గ్రామంలో రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఆనంద్ బుధవారం పరిశీలించారు. పక్కాగా రైతుల భూములకు హద్దులు నిర్ధారించేందుకు రెవెన్యూ బృందాలు గ్రామాల్లో పనిచేస్తున్నాయన్నారు. రీసర్వేలో ప్రభుత్వ భూముల వివరాలు, రైతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని వారికి సూచించారు. ప్రధానంగా విస్తీర్ణం, రైతుల పేర్లు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడుతూ రీ సర్వే సమాచారం మీకు అధికారులు చెప్పారా... రీసర్వేవిషయమై మీకు నోటీసులు ఇచ్చారా? మీ సమక్షంలో భూమికి కొలతలు వేసి హద్దులు చూపించారా... ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. రీసర్వే వివరాలను గ్రామసభ నిర్వహించి రైతులకు తెలియజేయాలని, ఏవైనా అభ్యంతరాలు వుంటే వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సర్వే అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రీసర్వే రికార్డులను పక్కాగా నిర్వహించడం పట్ల సర్వే అధికారులను అభినందించారు. ఆయన వెంట జిల్లా సర్వేల్యాండ్‌రికార్డుల ఎడి వై నాగశేఖర్, డిఐ సత్యనా రాయణ, తహశీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, సర్వేయర్ కిరణ్ తది తరులున్నారు.

ప్రశ్నా పత్రాలు వచ్చేశాయ్..

ప్రజాశక్తి-కోవూరు

మండలంలో ఈ నెల 17వ తేదీన నిర్వహిం చనున్న. పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు బుధవారం కోవూరు పోలీసే స్టేషన్‌కు గట్టి. బందోబస్తు మధ్య చేరుకు న్నాయి. ఈ సందర్భంగా కోవూరు మండలానికి సంబం ధించిన ఆరు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిం టెండెంట్లు పరీక్షా పత్రాలను ట్రంక్ పెట్టెలో భద్రపరచి వాటికి ప్రత్యేకంగా సీల్ వేసేలా చర్యలు తీసుకున్నారు.

నూతన తహశీల్దార్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి -ఉలవపాడు

మండలంలో నూతన తహశీల్దార్‌గా టి. శ్రీనివాసులు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఉలవపాడు తహశీల్దార్ గా పనిచేస్తున్న వి.లావణ్య ను కందుకూర్ బదిలీ చేయగా కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం లో డి.ఏ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాసులు ఉలవపాడు తహశీల్దార్ బాధ్యతలు స్వీకరించారు.

యువత నెత్తిన కూటమి కుచ్చుటోపి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

నిరుద్యోగభృతి కల్పిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది మంది యువతను కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని వైసిపి మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ విమర్శించారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచన మేరకు తోట పల్లిగూడూరు మండలం, ఇస్కపాలెంలో వైసీపీ పోరుబాట చేపట్టింది. ఈ సందర్భంగా శంకరయ్య గౌడ్, వైసీపీ నాయకులు తలమంచి సురేంద్ర బాబులు కూటమి ప్ర భుత్వ అసమర్ధ, అరాచక పాలనపై నిప్పులు చెరిగారు. ఫీజు రీయింబర్స్ మెంట్, నిరుద్యోగ భృతి, మెడికల్ కాలేజీల విషయంలో కూటమి ప్రభుత్వ వైఖరిపై విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక పోవడంతో చదువులు అర్ధాంతరంగా ఆగిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభు త్వం నిరుద్యోగ భతి ఇస్తామని ప్రకటించిందని, అధికా రంలోకి వచ్చిన తర్వాత లక్షలాది మంది నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆరోపించారు. వైసీపీ అ ధికారంలో ఉన్నప్పుడు నాణ్యమైన వైద్యం అందించాలని రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రా రంభించారని, వాటిలో ఐదు కాలేజీలు ప్రారంభోత్సవం

నినాదాలు చేస్తున్న వైసిపి నాయకులు

జరిగి ఫీజు అడ్మిషన్లు కూడా జరిగాయని తెలిపారు. మి గిలిన 11 కాలేజీలు ఈ ఏడాది ప్రారంభించేలా పనులు పూర్తి చేసినప్పటికీ వాటిని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. అంతేకాకుండా ఆ కాలేజీలను పీపీల మోడ్‌లో ప్రైవేటుకు అప్పగించి పేద విద్యార్థుల కు మెడికల్ చదువులను పేద విద్యార్థులకు దూరం చేసే కుట్రకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం తెర లేపిందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బ కాయిలు 4,600 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇవ్వాల్సింది రూ.7,100 బడ్జెట్లో కేటాయింపు లు 2,600 కోట్లే అన్నారు. వైసీపీ హయాంలో 18,663.44 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. 16,347 పోస్టులతో డీఎస్సీపై సీఎం చంద్రబాబు తొలి సంతకం చేసినా.. ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదని ఆరోపిం చారు. ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ హామీ 9 నెలలు గడుస్తున్నా వెలువడలేదని తెలిపారు. ఈ నేప థ్యంలో 'యువత పోరు బాటలో విద్యార్థులు, నిరుద్యో గులు ప్రభుత్వంను ఎండగట్టడానికి సిద్ధమయ్యారన్నారు. దీనికిముందు మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వి గ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఇసనాక రమేష్ రెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, నెల్లిపూడి సునీల్ రెడ్డి, జెడ్పిటిసి శేషమ్మ, ఎంపిటిసి రాయపు శ్రీనివాసులు, మాజీ జెడ్పిటిసి చిరంజీవి గౌడ్, తాని తిరుపతయ్య, సంధ్యారాణి, వైసీపీ కార్యకర్త లు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మండలంలోని జొన్నవాడ గ్రామంలో ధాన్యాన్ని మిల్లర్లకు విక్రయిస్తున్న రైతులతో బుధవారం కలెక్టర్ మాట్లాడారు. బుచ్చి నుంచి నెల్లూరు వెళుతూ మార్గ మధ్యలో కారు ఆపి ధాన్యం విక్రయిస్తున్న రైతులతో కలెక్టర్ ముఖాముఖీగా కాసేపు మాట్లాడడం జరిగింది. ధాన్యాన్ని నేరుగా రైసుమిల్లర్లకు ఎందుకు విక్రయిస్తున్నారని, ఎంత ధరకు ధాన్యం విక్రయిస్తున్నారని అడిగారు. ఇందుకు రైతులు బదులిస్తూ ఈక్రాప్‌లో తమ పంట నమోదు కాలేదని, 17వేలకు ఇక్కడకు వచ్చిన మిల్లర్లు కొనుగోలు చేస్తే, శ్రమ తప్పుతుందని వారికే విక్రయిస్తున్నట్లు ఆయనతో చెప్పారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి విక్రయిస్తే

కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు

24 గంటల్లో డబ్బులు వస్తున్నాయని, మీరు కేవలం మీసమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంప్రదిస్తే చాలని వారే షెడ్యూలు ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని చెప్పారు. గోతాలు, రవాణాఖర్చులు, లేబర్‌చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లించి, 24 నుంచి 48 గంటల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం డబ్బులు జమచేస్తున్నట్లు కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించుకోకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకోవాలని రైతులకు సూచించారు.

కొనుగోలు కేంద్రాలపై అవగాహన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని పేడూరు, నరుకూరు గ్రామాలలో ఎంఏఓ వివి శిరీష రాణి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి అవగాహన కల్పించారు. ధాన్యంలో ఉండాల్సిన తేమ శాతం గురించి రైతులకు వివరించారు. ధాన్యాన్ని కొను గోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవచ్చని రైతులకు సూచించారు. రవాణా ఛార్జీలు హమాలీ రుసుం రైతులకు ధాన్యం డబ్బులతో కలిపి వ్యక్తగత బ్యాంక్ అకౌంట్లో జ మ అవుతుందని పేర్కొన్నారు. జిపిఎస్ వాహనం ద్వారా మాత్రమే ధాన్యం

మాట్లాడుతున్న నెంఎఒ శిరీష

రవాణాకు వాడాలని సూచించారు. మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు షెడ్యూలింగ్ ఇస్తున్నారని, ధాన్యాన్ని అమ్మదలచిన రైతులు కొనుగోలు కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తేమ శాతం నిర్ధారించుకుని షెడ్యూలింగ్ చేయించుకోవాలని తెలిపారు. సొసైటీ ట్రక్ షీట్ తీసి రైతులకు మిల్లర్ల ద్వారా గోనె సంచులు సరఫరా చేస్తారని తెలిపారు. రైతులు ఎవ్వరు దళారీలను మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. వ్యవ సాయ అధికారులు వరి కోతలు జరుగుతున్న రైతు కిర ణ్ కుమార్ పొలాన్ని సందర్శించి వరి ధాన్యాన్ని సేకరిం చి మాయిశ్చర్ మీటర్ ద్వారా తేమ శాతాన్ని నిర్ధారించారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రంలో షెడ్యూల్ వేయిం చడం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు.ఏ రాజ్ కుమార్, ఏఈఓ హరిబాబు, విఏఏ నిరీష, ప్రజా ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.



స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేను నగర పాలక సంస్థ పరిధిలో విజయ వంతం చేయాలని అదనపు కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యా లయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో పారిశు ధ్య విభాగం అధికారులు సిబ్బందితో సమా వేశాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భ ంగా వినూత్నమైన ఆలోచనలతో ఫ్లోర్ పాయింట్ల వద్ద చెత్త వేయడాన్ని విజయవ ంతంగా అరికట్టిన పారిశుద్ధ్య మేస్త్రీలను అభినందిం చారు.నగరవ్యాప్తంగా బ్లాక్ స్పాట్లను గుర్తించి ఆయా ప్రాంతాలలో శుభ్రం చేసి రంగవల్లులు పూల కుండీలు ఉంచి తిరిగి అక్కడ చెత్త వేయకుండా పర్యవేక్షించాలని అదనపు కమిషనర్ ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో పొందుపరిచిన 10 ప్రశ్నలను ప్రజలకు వివరించి నగరంలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ గురించి వారి అభిప్రాయాలను సేకరించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మందులు వాడడంలో సూచనలు పాటించాలి

ప్రజాశక్తి- కోవూరు

జీఏపీ పొలంబడి ప్రధాన ఉద్దేశం రైతులు పురుగు మందులు విచక్షణారహితంగా వాడకుండా సిఫార్సు మేరకే వాడుకోవాలని విత్తన ధ్రువీకరణ అధికారి సుజిత్ కుమార్‌రెడ్డి తెలి పారు. మండలంలోని పలు ప్రాంతాల్లో పొలంబడి క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగుమందులు విచక్షణారహితంగా వాడడం వలన పర్యావరణం విషతుల్యమై పంటల దిగుబడి తగ్గేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు విషపూరితమైన క్రిమి సంహారక మందులు వాడకుండా ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. పంట ఉత్పత్తులను విశ్లేషణ జరిపి రైతులకు విషతుల్యాలు పరిధిలోనే ఉంటే వారికి జీఏపీ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసా యాధికారి ఇందిరావతి, వ్యవసాయ సహా యకులు చాద్విక, చైతన్య, రైతులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కోవూరు

జిల్లాలో ఐవిఆర్ఎస్ సర్వే జరుగుతోన్న అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్ర మంపై ఆయా పంచాయతీల కార్య దర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్‌ఛార్జి డీపీఓ డాక్టర్ రమణయ్య అన్నారు. మండల ంలోని ఇనమడుగు గ్రామంలో నిర్వహించిన ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెత్తను తడి చెత్త, పొడి చెత్త రూపంలో వేరు చేసి తద్వారా చెత్త నుంచి సంపద కేంద్రాల్లో భూములకు అవసరమైన సారవంతమైన ఎరువులను తయారు చేసి తద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంచుకో వాల న్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.